
# వృద్ధికి టారిఫ్ దెబ్బ

**ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ అంచనాను తగ్గించిన ఎస్అండ్‌పీ**

- *6.5 శాతం నుంచి 6.3 శాతానికి కోత*
- *ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం*
- *ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి రూపీ పతనం!*




న్యూఢిల్లీ, మే 2: భారత జీడీపీ అంచనాలకు ప్రముఖ గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ కోత పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను దేశ వృద్ధిరేటు 6.3 శాతంగానే ఉండొచ్చని శుక్రవారం పేర్కొన్నది. ఇంతకుముందు అంచనా 6.5 శాతంగా ఉండటం గమనార్హం. 'ప్రపంచ స్థూల ఆర్థిక వ్యవస్థ సమాచారం: ఆర్థిక వృద్ధిని నెమ్మదింపజేస్తున్న అమెరికా వాణిజ్య విధానంలోని భారీ మార్పులు' పేరిట ఓ నివేదికను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తాజాగా విడుదల చేసింది. ఈ సందర్భంగానే గతంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి పేర్కొన్న అంచనాలను సవరించింది.

**ట్రంప్ సుంకాల సెగ**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలకు తెరలేపడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. అయితే చైనా మినహా మిగతా దేశాలపై విధిస్తామన్న టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేయడం కొంతలోకొంత ఊరటనిచ్చింది. ఈ క్రమంలోనే భారత్‌సహా ఆయా దేశాలు.. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే పనిలోపడ్డాయి. అయినప్పటికీ ఈ ట్రేడ్ వార్‌పై అనిశ్చిత పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉండటంతో.. ఆ సెగ ఇప్పుడు దేశ జీడీపీ అంచనాకు తాకింది. నిజానికి ఈ ఏడాది మార్చిలోనే దేశ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.5 శాతంగానే ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంచనా వేసింది. అంతకుముందు ఇది 6.7 శాతంగా ఉంటుందన్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో 0.2 శాతం మేర తగ్గొచ్చని ప్రకటించింది. ఈ లెక్కన చూసుకుంటే జీడీపీ అంచనాకు దాదాపు అర శాతం కత్తెర పడినట్టే అనుకోవచ్చు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) దేశ జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంటున్నది.

**రూపాయి అధోగతే..**

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి దిగజారవచ్చని ఎస్అండ్‌పీ ఈ సందర్భంగా తమ రిపోర్టులో పేర్కొన్నది. ప్రస్తుతం 84.57 వద్ద రూపీ వాల్యూ కదలాడుతుండగా.. 2024 చివర్లో 85.64 వద్ద ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకానైతే రూపాయి మారకం విలువ రూపాయికిపైగానే కోలుకున్నట్టు కనిపిస్తున్నది. అయితే గడిచిన ఈ 4 నెలల్లో తీవ్ర ఒడిదొడుకులనూ చవిచూసింది. ఫిబ్రవరి 6న మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి క్షీణించింది. ఒకానొక దశలో 87.60 స్థాయినీ తాకింది. ఈ నేపథ్యంలో ఎస్అండ్‌పీ అంచనా మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. మళ్లీ రూపాయి ఒత్తిడికి లోనవబోతున్నదన్న సంకేతాలనిస్తున్నది.

**2025-26కుగాను దేశ జీడీపీ అంచనాలకు కోతలు**

| సంస్థ | ప్రస్తుతం | మునుపు |
|---|---|---|
| ఆర్బీఐ | 6.5% | 6.7% |
| ఫిచ్ | 6.4% | 6.5% |
| ఓఈసీడీ | 6.4% | 6.9% |
| ఎస్అండ్‌పీ | 6.3% | 6.5% |
| ప్రపంచ బ్యాంక్ | 6.3% | 6.7% |
| ఐఎంఎఫ్ | 6.2% | 6.5% |
| మూడీస్(2025) | 6.1% | 6.4% |

- **ఈ ఏడాది అమెరికా జీడీపీ వృద్ధిరేటు 1.5 శాతంగా, వచ్చే ఏడాది 1.7 శాతంగా ఉండొచ్చంటున్న ఎస్అండ్‌పీ.**
- **చైనా జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది 0.7 శాతం తగ్గి 3.5 శాతానికే పరిమితం కావచ్చు. వచ్చే ఏడాదైతే 3 శాతంగానే ఉండొచ్చని అంచనా.**
- **అమెరికాతో సుంకాల సమరానికి బదులుగా చాలా దేశాలు వాణిజ్య ఒప్పందాలనే చేసుకునే వీలుందంటున్న ఎస్అండ్‌పీ.**
- **అమెరికా, యూరప్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు సంక్లిష్టం కావచ్చు. కఠిన వైఖరికే మొగ్గుచూపుతున్న కెనడా.**
- **పరస్పర ప్రతీకార సుంకాలతో ఏ దేశానికీ లాభం ఉండదంటున్న ఎస్అండ్‌పీ. ఈ తరహా రక్షణాత్మక ధోరణులు మంచివికావని హితవు.**



## మళ్లీ పెరిగిన పుత్తడి

న్యూఢిల్లీ, మే 2: బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు దేశీయంగా ఆభరణాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా పుత్తడి ధర రూ.96 వేల మార్క్‌ను అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.1,080 ఎగబాకి రూ.96,800 పలికింది. గురువారం భారీగా తగ్గిన ధరలు మళ్లీ ఆ మరుసటి రోజే పెరగడం విశేషం. స్థానిక ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని ట్రేడర్ వెల్లడించారు. పసిడితోపాటు కిలో వెండి రూ.1,600 ఎగబాకి రూ.97,100 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 23.10 డాలర్లు పెరిగి 3,262.30 డాలర్లకు చేరుకోగా, వెండి 32.49 డాలర్లుగా ఉన్నది.

## ఆడీ కార్లు ప్రియం

న్యూఢిల్లీ, మే 2: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ ఇండియా మరోసారి ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల మాడళ్ల ధరలను రెండు శాతం వరకు సవరిస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతోపాటు ఎక్స్ఛేంజ్ రేట్లలో మార్పులు చోటు చేసుకోవడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని తెలిపింది.

## విక్రయదారులకు అమెజాన్ దన్ను

హైదరాబాద్, మే 2: దేశవ్యాప్తంగా ఉన్న చిన్న స్థాయి విక్రయదారులకు అమెజాన్ శుభవార్తను అందించింది. రూ.300 కంటే తక్కువ ధర కలిగిన ఉత్పత్తులపై రెఫరల్ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో విక్రయదారులు తక్కువ ధర కలిగిన వస్తువులపై గణనీయమైన రీతిలో పొదుపు చేసుకునేందుకు అవకాశం లభించనున్నదని అమెజాన్ ఇండియా సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. దుస్తులు, బూట్లు, ఫ్యాషన్ నగలు, గృహోపకరణాలు, వంటగదికి సంబంధించి 135కి పైగా రంగాలకు చెందిన ఉత్పత్తులకు ఈ నిర్ణయం వర్తించనున్నది. తెలంగాణ నుంచి 50 వేల మంది విక్రయదారుల నుంచి సేకరించి తమ ఉత్పత్తులను అమెజాన్‌లో విక్రయిస్తున్నాయి.



## టాప్‌గేర్‌లో క్రెటా విక్రయాలు

న్యూఢిల్లీ, మే 2: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్‌కు చెందిన ఎస్‌యూవీ మాడల్ క్రెటా మరో మైలురాయిని సాధించింది. వరుసగా రెండో నెల ఏప్రిల్‌లోనూ అత్యధికంగా అమ్ముడైన వాహనాల్లో తొలిస్థానంలో నిలిచింది. గత నెలలో 17 వేల యూనిట్ల క్రెటా వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 10 శాతం వృద్ధిని కనబరిచాయి. సంస్థ మొత్తంగా 69,914 యూనిట్ల వాహనాలను విక్రయించగా, వీటిలో ఎస్‌యూవీ వాటా 71 శాతంగా ఉన్నదని పేర్కొంది. ఈ వాహనంపై కస్టమర్లు పెట్టుకున్న నమ్మకానికి ఇది నిదర్శనమని కంపెనీ సీవోవో, డైరెక్టర్ తరుణ్ గార్గ్ తెలిపారు. క్రెటాతోపాటు వెన్యూ, ఎక్స్‌టర్, అల్కాజర్, ఇతర మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. పదేండ్ల క్రితం దేశీయ రోడ్లపైకి అందుబాటులోకి వచ్చిన ఈ మాడల్‌కు 12 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.

## అమెరికాలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లు

- **యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడి**

న్యూఢిల్లీ, మే 2: అమెరికాలో అమ్ముడుకానున్న ఐఫోన్లలో భారత్‌లో తయారైనవే అత్యధికంగా ఉండనున్నాయని యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడించారు. వరుసగా ఏడో త్రైమాసికంలోనూ చైనాలో ఐఫోన్ల అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో సంస్థ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. ఒకవైపు ప్రతీకార సుంకాలు విధిస్తుండటంతో భారత్‌లో తయారవుతున్న ఐఫోన్లను భారీగా దిగుమతి చేసుకోవాలని చూస్తున్నది సంస్థ. జూన్ త్రైమాసికం నాటికి యూఎస్‌లో అమ్ముడుకానున్న అత్యధిక ఐఫోన్లలో భారత్ నుంచి దిగుమతి చేసుకునేవే ఉండనున్నాయని, అలాగే వియత్నాం నుంచి ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచెస్, ఎయిర్‌ప్యాడ్స్ ఉండనున్నాయని చెప్పారు. 2024లో అమెరికాలో 75.9 మిలియన్ల ఐఫోన్లు అమ్ముడయ్యాయి. ఇప్పటికే యునైటెడ్ స్టేట్స్‌కు భారత్ నుంచి అత్యధికంగా ఐఫోన్లు ఎగుమతి అవుతున్నాయని, ఫిబ్రవరితో ముగిసిన మూడు నెలలకాలంలో ఎగుమతులు 82 శాతం పెరిగాయని, ఇదే క్రమంలో మార్చి నాటికి 97.6 శాతానికి చేరుకున్నాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటిలిజెన్స్ తన నివేదికలో వెల్లడించింది. మార్చితో ముగిసిన రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 90.75 బిలియన్ డాలర్ల నుంచి 95.35 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.



## కోలుకున్న స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 260, నిఫ్టీ 12 పాయింట్ల లాభం

ముంబై, మే 2: దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. అమెరికా-భారత్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశాలుండటం, రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లుకావడం మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఎగబడి కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లు ఆశాజనకంగా ట్రేడవడంతో సూచీలకు ఉత్సాహాన్నిచ్చింది. ఇంట్రాడేలో 900 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 259.75 పాయింట్లు అందుకొని 80,501.99 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 12.50 పాయింట్లు పెరిగి 24,346.70 పాయింట్లకు చేరుకున్నది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో అదానీ పోర్ట్ షేరు 4 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, మారుతి, టాటా మోటర్స్, ఐటీసీ, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ముగియగా..నెస్లె, ఎన్టీపీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్, టైటాన్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా సర్వీసెస్ 1.67 శాతం అధికంకాగా, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..టెలికం, కన్స్యూమర్ డ్యూరబుల్, పవర్, యుటిలిటీ, మెటల్, రియల్టీ రంగ షేర్లు నష్టపోయాయి.




## సర్కారీ అప్పులు తగ్గాలి

- **అప్పుడే దేశ క్రెడిట్ రేటింగ్ జూమ్**
- **డీఈఏ కార్యదర్శి అజయ్ సేథ్**

న్యూఢిల్లీ, మే 2: దేశ రుణ భారం చాలా ఎక్కువగా ఉందని, ఇది తగ్గాలని.. అప్పుడే గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు భారత క్రెడిట్ రేటింగ్‌ను పెంచుతాయని ఆర్థిక వ్యవహారాల (డీఈఏ) కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు. ఈ సర్కారీ అప్పులపై చెల్లించే వడ్డీ భారం కూడా మోయలేనివిధంగా తయారవుతున్నదని, దాన్ని దించుకోవాల్సిన అవసరం ఎంతో ఉన్నదనీ ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఐఎస్ఏఏసీ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ కాన్ఫరెన్స్‌లో అజయ్ మాట్లాడుతూ.. అప్పులు పెరుగుతూపోవడం మంచిదికాదన్నారు. రేటింగ్ అప్‌గ్రేడ్ కోసం రేటింగ్ ఏజెన్సీలతో భారత్ ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తోందని వివరించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడానికి మితిమీరిన రుణ భారమేనంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఖర్చులకు సంబంధించి స్పందిస్తూ.. చాలావరకు సమతూకం లోపించిందన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభివృద్ధి కంటే రుణ నిధులను వ్యయాలను పెంచుకోవడానికే వినియోగిస్తున్నాయన్నారు. కాగా, ట్యాక్స్-టు-జీడీపీ రేషియో 20 శాతానికి చేరాలంటే 5-6 ఏండ్లు పట్టవచ్చన్నారు.

## బ్యాంకులపై ఆర్బీఐ భారీ జరిమానా

ముంబై, మే 2: నాలుగు బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ షాకిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకుగాను ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాతోపాటు మరో రెండు బ్యాంకులపై భారీ స్థాయిలో జరిమానా విధించింది. వీటిలో ఐసీఐసీఐ బ్యాంక్‌పై రూ.97.80 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.61.40 లక్షలు, ఐడీబీఐ బ్యాంక్‌పై రూ.31.8 లక్షలు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రపై రూ.31.80 లక్షల చొప్పున విధించింది. కేవైసీ నిబంధనలు పట్టించుకోకపోవడం, సైబర్ సెక్యూరిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్లనే జరిమానా విధించింది.



*వీసీకి హాజరైన కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత*

## లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలి

జగిత్యాల, మే 2: ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి కేటాయించిన 3,500ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయం నుంచి శుక్రవారం సీఎస్ కే రామకృష్ణారావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్నా రద్దు చేస్తామన్నారు. ఈ నెల 5నుంచి 20వరకు జిల్లాకు ఒక మండలం చొప్పున రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టా ఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు. ఈ నెల 4న జరుగనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీసీలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్‌రెడ్డి, శ్రీనివాస్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## రోడ్డు దాటుతుండగా..

- **ఆర్టీసీ బస్సు ఢీకొని హనుమాన్ మాలదారుడి మృతి**



కృష్ణమూరి (ఫైల్)

జగిత్యాల రూరల్, మే 2: రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు ఢీకొని హనుమాన్ మాలదారుడు మృతి చెందిన ఘటన శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్ నగర్‌కు చెందిన కొడిక్యాల కృష్ణమూర్తి (50) ఇటీవల హనుమాన్ మాల వేసుకున్నాడు. శుక్రవారం పట్టణంలోని నటరాజ్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా, నిజామాబాద్ నుంచి హన్మకొండకు వెళ్తున్న వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## ఏడో తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు

- **జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ సాలియానాయక్**



సాలియానాయక్

జగిత్యాల, మే 2: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ జగిత్యాల సర్కిల్ పరిధిలో ఈ నెల 1 నుంచి 7తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ సాలియా నాయక్ శుక్రవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా సర్కిల్‌లోని డీఈ టెక్నికల్ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. రైతులు, వినియోగదారులు విద్యుత్ పనులు స్వంతగా చేయవద్దని కోరారు. ప్రమాదాలు జరుగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్‌ను (1912) సంప్రదించాలని ని సూచించారు.

## అవకతవకలు జరుగనివ్వద్దు

- **అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలి**
- **కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల**
- **మండల పరిషత్‌లో సమీక్షా సమావేశం**

మల్లాపూర్, మే 2: ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అర్హులకే ఇండ్లు అందేలా చూడాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. వేసవికాలం దృష్ట్యా మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేసి ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక జాగ్రత్తలను తీసుకోవాలని ఆదేశించారు. చాలా గ్రామాల్లో శానిటేషన్, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు దెబ్బతిన్నాయని, అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఐసీడీఎస్ శాఖకు చెందిన గ్రామాల్లోని కొంత మంది అంగన్‌వాడీ టీచర్లు రాజకీయాల జోలికి వెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే ఇలాంటి చర్యలు మానుకోవాలని సూచించారు. ఇక్కడ డీఈఈ రమణరెడ్డి, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, ఏవో లావణ్య, తదితరులు ఉన్నారు.



మల్లాపూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

## ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

రాయికల్, మే 2 : సుదీర్ఘ కాలం ఆర్మీలో జవానుగా సేవలందించి, ఉద్యోగ విరమణ పొంది స్వగ్రామానికి చేరుకున్న జవానుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి ఊరేగింపుగా ఇంటికి చేర్చారు. మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన నూకల మల్లయ్య 17 సంవత్సరాల క్రితం భారత ఆర్మీలో జవానుగా విధుల్లో చేరాడు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించి మల్లయ్య ఆర్మీ ఉద్యోగం నుంచి విరమణ పొంది శుక్రవారం భూపతిపూర్‌కు చేరుకున్నాడు. గ్రామస్తులంతా గ్రామ శివారులో ఏకమై మల్లయ్యకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి, ప్రత్యేకంగా అమర్చిన జీపులో గ్రామంలో ఊరేగింపుగా తీసుకెల్లి ఇంటికి చేర్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు చంద్రశేఖర్, మహేశ్వర్‌రావు, వేణు, గ్రామస్తులు విజయ్, దేవేందర్‌రెడ్డి, లక్ష్మణ్, రాజిరెడ్డి, రాంప్రసాద్, అంజయ్య, తేజ పాల్గొన్నారు.


### కార్యకర్తకు చల్మెడ పరామర్శ

రుద్రంగి, మే 2: మండల కేంద్రంలోని దసరా నాయక్‌తండాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లావుడ్య మో హన్ అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. దీంతో బీ ఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మోహన్ ఆరోగ్య పరిస్థితిని ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నాయకులు ఉన్నారు.

## చిన్నారిని ఆదుకోరూ..

- **అంతుచిక్కని వ్యాధితో అవస్థలు**
- **వైద్య సాయం చేయాలని వేడుకోలు**

వీర్నపల్లి, మే 2: ఆడుకోవాల్సిన వయస్సులో చిన్నారికి పెద్ద కష్టం వచ్చిపడింది. నాలుగేళ్ల ప్రాయంలోనే అంతుచిక్కని వ్యాధితో అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బంజేరు గ్రామ పరిధి బీరప్ప తండాకి చెందిన బట్టు రజిత-రమేశ్ దంపతులకు ఈశ్వర్ ప్రసాద్ ఉన్నాడు. ఉపాధి నిమిత్తం చిన్నారి తండ్రి కువైట్ వెళ్లాడు. గతేడాది చిన్నారి ఫిట్స్, జ్వరంతో కూడిన అనారోగ్యం బారిన పడడంతో మొదట సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేర్పించారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మెరుగైన వైద్యానికి హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించారు. ఉన్న కొంత వ్యవసాయ భూమి అమ్మి రూ.9లక్షలతో వైద్యం చేయించారు. అయినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో వైద్యులు మరింత డబ్బులు అవసరమని చెబుతున్నారు. చిన్నారి అనారోగ్యంతో కనీసం కూర్చోకపోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేక చిన్నారి తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. దాతలు సాయం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి వైద్య సాయం చేయాలని వేడుకుంటున్నారు. సాయం అందించే వారు 8309301248 నంబర్‌కు ఫోన్ పే చేయాలని కోరారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారి ఈశ్వర్ ప్రసాద్ (ఫైల్)

### యువతులను వేధిస్తే చర్యలు

రాజన్నసిరిసిల్ల, మే 2(నమస్తే తెలంగాణ) : మహిళలు, యువతులను వేధించే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేశ్ గితే హెచ్చరించారు. ఎలాంటి ఇబందులున్నా మహిళలు నిర్భయంగా షీటీంలు 8712656425కి ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో పనిచేస్తున్న షీటీంల వివరాలు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. మహిళలను వేధిస్తున్న పోకిరీలపై గత నెలలో ఐదు కేసులు నమోదు చేశామని తెలిపారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులు, గ్రామాల్లో పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, పోక్సో చట్టాలపై షీటీంలు అవగాహన కల్పిస్తున్నాయన్నారు. పోకిరీలకు తల్లిదండ్రుల ఎదుట కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. రోడ్లపైన వెళ్లేటప్పుడు ఆకతాయిలు అవహేళనగా మాట్లాడినా, వెంబడించినా డయల్ 100కి ఫోన్ చేయాలని తెలిపారు.

### మహిళా కానిస్టేబుల్‌పై సీఐకి ఫిర్యాదు

మల్లాపూర్, మే 2: మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్ మౌనికపై మండల కేంద్రానికి చెందిన ఏనుగు లక్ష్మి శుక్రవారం మెట్‌పల్లిలోని సీఐ కార్యాలయంలో సీఐ అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మూడు నెలల క్రితం తనపై గ్రామానికి చెందిన అంజిరెడ్డి దాడి చేశాడని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశామన్నారు. తాము ఇచ్చిన ఫిర్యాదులో సదరు మహిళా కానిస్టేబుల్ తప్పుడు వివరాలను నమోదు, చేసి కేసును పక్కదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి, తనకు న్యాయం చేయాలని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

### ఆయిల్‌పామ్ సాగుపై నేడు అవగాహన సదస్సు

జగిత్యాల టౌన్, మే 2: జిల్లా కేంద్రంలోని జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లాలోని సుమారు 300మంది రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై శనివారం అవగాహన కలిపంచనున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జీ శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు మెలకువలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కోత పద్ధతులు, మార్కెటింగ్, కొనుగోలు విధానం, అంతర్ పంటల సాగు విధానం గురించి వివరాలు వెల్లడిస్తారని చెప్పారు.

### 'పది' టాపర్స్‌కు కలెక్టర్ అభినందన



*ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కలెక్టర్ సత్యప్రసాద్*

జగిత్యాల టౌన్, మే 2: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ బీ సత్యప్రసాద్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు నిరాశ పడొద్దన్నారు. ప్రయత్నాలు కొనసాగిస్తే విజయం తప్పదన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు త్వరలో నిర్వహించే సప్లిమెంటరీకి సన్నద్ధం కావాలన్నారు. ఇక్కడ డీఈవో కే రాము, కో ఆర్డినేటర్లు సీహెచ్‌సత్యనారాయణ, కే రాజేశ్, మహేశ్, తదితరులు ఉన్నారు.

### కేటీఆర్ కోలుకోవాలని పూజలు

గంభీరావుపేట, మే 2: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో గురువారం బీఆర్ఎస్ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు రాచర్ల పార్థసారథి ఆధ్వర్యంలో నేతలు ఆంజనేయ స్వామికి చందనం సమర్పించి కేటీఆర్ వెన్నుపూస సమస్య నుంచి కోలుకోవాలని మొక్కుకున్నారు. ఇక్కడ నేతలు సింగారపు నాగరాజుగౌడ్, కరువారి శంకర్ తదితరులున్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కథలాపూర్, మే 2 : మండలంలోని చింతకుంటకు చెందిన గాజ బ్రహ్మానందస్వామి (30) యువకుడు శుక్రవారం సాయంత్రం కారులో వెళ్తూ చెట్టును ఢీ కొనడంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. బ్రహ్మానందస్వామి హైదరాబాద్‌లో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. శుక్రవారం స్వగ్రామానికి వచ్చి తన బంధువు కారులో గ్రామ శివారుకు స్నేహితులతో కలిసి వెళ్లారు. చెట్టుకు కారు ఢీ కొనడంతో బ్రహ్మానందస్వామి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా, మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతుడికి ఏడాది క్రితం వివాహం జరిగింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.